4వ పాఠం అక్టోబరు16-22

# నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను

సబ్బాతు మధ్యాహ్నము అక్టోబరు 16

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : ద్వితి 6:4,5; 10:12; ఎఫెసి 2:1-10; ప్రకటన 14:6,7; ద్వితి 4:37; 1:1; మార్కు 12:28-30.**

**కంఠతవచనం : "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" (ద్వితి 6:5).**

యూదయ మతమునకు సంబంధించి, ప్రాముఖ్యమైన ప్రార్ధనలలో ఒక దానిని ద్వితి 6 నుండి ఎంచుకొనబడెను. అది "షామా" అనగా వినుట లేక విధేయత చూపుట అనే అర్థము నిచ్చే మాట నుండి ఏర్పడిన "షెమా" అనే హెబ్రీ పదముతో పిలువబడే ప్రార్ధనయై యున్నది. ఈ మాట కేవలం ద్వితియోపదేశకాండములోనే కాకుండా పాత నిబంధన గ్రంథమంతటిలోను అనేక మార్లు కనిపిస్తూ ఉంటుంది.

"షెమా"లోని మొదటి వరుసలోని మాటలను ఈవిధముగా చదువుదురు. "షెమా ఇజ్రయేల్ అదొనై ఎలోహిను అదొనై ఇకాడ్" దాని అర్థము ఈ క్రింది విధముగా ఉంది. "ఓ ఇశ్రాయేలూ వినుము మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా" (ద్వితి 6:4). దేవుని గూర్చి ఆలోచనల నుండి ధ్యాన భంగము కలుగకుండా ఇశ్రాయేలీయులు ప్రార్థించేటపుడు చాలాసార్లు వారి కండ్లు మూసుకుంటారు. "షెమా" యొక్క మొదటి వరుసలోని మాటలు "అదొనై ఎలోహి" దేవుడొక్కడే అనే భావము ధృవీకరిస్తుంది. దేవుడొక్కడే వేరొక దేవుడు లేడనే భావమునకు ఇశ్రాయేలీయులు విధేయతను చూపిస్తారు. దానికే "మనదేవుడైన యెహోవా" అని కూడా చదువుదురు.

ఇశ్రాయేలు జనాంగము వాగ్దాన భూమిలోనికి ప్రవేశించనైయున్న తరుణములో యూదుల యొక్క ప్రార్ధనలోని మొదటి వరుసను మోషే ఎన్నుకొని ఆ మాటలతో తన సంభాషణను ఆరంభించాడు. ఆ ఆరంభ మాటలను ముగించిన తరువాత ఆనాడు వలె నేటికిని ప్రధానముగా ఎంచబడిన సత్యమును గూర్చి శక్తివంతమైన రీతిలో మాట్లాడెను.

– అక్టోబరు 23, సబ్బాతు దినమున ఈ వారము యొక్క పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడవలెను.

ఆదివారం అక్టోబరు 17

## దేవునిని ప్రేమింపవలెను

ఇశ్రాయేలు జనాంగమునకు మోషే వారి చరిత్రను వివరించిన తరువాత వారికి వాగ్దానము చేయబడిన దేశమును స్వతంత్రించుకొని, దానిలో జీవించుటకు వారేమి

చేయవలసియున్నదో సూచనలను ఇస్తున్నాడు. ద్వితియోపదేశ కాండమంతయు యెహోవా దేవుడు తన ప్రజల యొక్క తండ్రులతో తాను చేసిన నిబంధనను గురించి వివరించుచున్నది.

ద్వితి 6 ఈ విధముగా ఆరంభించబడినది. "నీవును నీ కుమారుడును నీ దేవుడైన యెహోవాకు భయపడి, నేను నీ కాజ్ఞాపించు ఆయన కట్టడలన్నియు నీ జీవిత దినములన్నిటను గైకొనుచు నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు మీరు స్వాధీనపరచుకొనుటకు ఏరు దాటి వెళ్ళుచున్న దేశమందుమీరు జరుపుకొనుటకు మీకు బోధింపవలెనని మీ దేవుడైన యెహోవా ఆజ్ఞాపించిన ధర్మమంతయు అనగా కట్టడలు విధులు ఇవే" (ద్వితి 6:1,2)

**ద్వితి 6:4,5 చదువుడి. 5వ వచనములో ఇశ్రాయేలు జనాంగమునకు యెహోవా దేవుడిచ్చిన ఆజ్ఞ ఏమిటి? దాని భావమేమి?**

"నీ పూర్ణ హృదయముతో నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" ఇక్కడ వారికి ఇవ్వవలసిన అన్ని సూచనలు, హెచ్చరికలతో పాటు వారు దేవుని ప్రేమింపవలెనని ఆజ్ఞాపించడం జరిగియున్నది. ఏవిధముగా ప్రేమించాలో అనే విషయాన్ని కూడా విశదీకరించడం జరిగింది" "నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ ఆత్మతోను, నీ పూర్ణశక్తితోను, నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" అని ప్రేమకున్న పరిపూర్ణ స్వభావమును వివరించెను.

మనము ఉనికిలో ఉన్నామంటే మరియు మనము ఏమైయున్నామో అది కేవలం దేవుడు మన యెడల చేసిన కార్యము వలన తప్ప మరే విధముగాను మనకు సాధ్యముకాదు. కాబట్టి మనము ఆయనను మన పూర్ణ హృదయముతోను ఆత్మతోను మరియు శక్తితోను, ఇతరులందరికన్నా ఆయనే సర్వాధికారి మరియు సర్వోన్నతుడైనందున ఆయన యెడల మన ప్రేమ పరిపూర్ణమైయుండాలి. ఆయన యందున్న మన ప్రేమ, మనము ఇతర విషయాలపై చూపే ప్రేమను సరియైన దృష్టి కోణంతో చూసే విధముగా మనలను నడిపించును.

హెబ్రీ భాషలో నీ దేవుడు నీ హృదయము, నీ శక్తి అని "నీ" అనే పదము ఏకవచనమును సూచించుచున్నది. నిజమే దేవుడు ప్రజలందరితో కలిసి మాట్లాడుచున్నను అందరు అని సంబోధించిన పదములో ప్రతి వ్యక్తి ప్రాముఖ్యమైన వాడే గనుక వ్యక్తిగతముగా ప్రతి వ్యక్తి దేవునియెడల తన విశ్వాస్యతను నిరూపించుకొనవలసియున్నాడు.

**నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణ ఆత్మతోను మరియు నీ పూర్ణ శక్తితోను నీవు దేవునిని ప్రేమించవలెను అనే విషయమును గూర్చి నీకెట్టి భావము కలుగుతుంది?**

సోమవారం అక్టోబరు 18

# దేవునికి భయపడి

ఇశ్రాయేలు జనాంగము వారికి కలిగిన సమస్తముతో దేవునిని ప్రేమించవలెను అని మోషే వారికి తెలియపర్చెను. అదొక ఆజ్ఞయైయున్నది. దీనికి ముందున్న కొన్ని వాక్యములలో మోషే వేరొక ఆజ్ఞను కూడా ఇచ్చియున్నాడు. "నీ దేవుడైన యెహోవాకు భయపడి" (ద్వితి 6:2) అని చెప్పియున్నాడు.

**ద్వితి 10:12 చదువుడి. ప్రేమ మరియు భయమును గూర్చి ఈ వాక్యము ఏమి చెప్పుచున్నది? దానిని ఏవిధముగా అర్థము చేసుకొనగలము?**

ఒక వాక్యములో దేవునికి భయపడమని చెప్పుచున్నది. మరొక వాక్యములో దేవునిని ప్రేమించమని చెప్పుచున్నది. ఈ వాక్యములో అయితే ఒకే సమయములో ఆయనకు భయపడి ప్రేమించమని రెండింటిని గూర్చి చెప్పుచున్నది. "భయపడుట"ను గూర్చి సామాన్య భావమును పరిగణలోనికి తీసుకున్నట్లయితే ఈ రెండు విషయాలు ఒకదానితో ఒకటి విబేధిస్తున్నట్లు కనిపిస్తుంది. అయితే అది నిజము కాదు. దేవుడేమైయున్నాడో అనే విషయమును గూర్చి ఆయన అధికారము, శక్తి మరియు న్యాయము నీతి విషయాలను మన పాపపు స్వభావముతోను, బలహీన మనస్తత్వాలతోను మరియు ఆయన మీద సంపూర్ణముగా ఆధారపడియున్నాము. గనుక దేవుని యెడల భయము కలుగుట నిజమే అనిపిస్తుంది. కాని ఆ భయము భక్తి పూర్వకమైనది. గౌరవముతో కూడినదైయుండవలెను. పాపములో పతనమైన మానవులము. దేవుని ధర్మశాస్త్రమును మీరినట్టివారము. శాశ్వత మరణమునకు పాత్రులము, అందునుబట్టి స్వాభావికముగానే మన స్పందన ఆయన యెడల భయపడుతున్నట్లుగానే కనిపిస్తుంది. అయితే ఆయన కృప మనలను శిక్ష నుండి కాపాడును.

**ఎఫెసి 2:1-10 చదువుడి. దేవునిని ఏక సమయములో ప్రేమించుచు ఆయన యెడల భయము కలిగి యుండుట ఏవిధముగా సాధ్యపడుతుందని ఈ వాక్యముల ద్వారా మనము ఎట్లు అర్థము చేసుకొనగలము?**

మనము దైవోగ్రతకు పాత్రులమైన బిడ్డలమైనప్పటికి (అందువలననే దేవునికి భయపడవలసియున్నాము) క్రీస్తు మన కొరకు మరణించి, ఆయనలో మనకు ఒక నూతన జీవితము అనుగ్రహించిన దానిని బట్టి అనగా పాపము నుండి విమోచింపబడినవారమై యున్నాము.

నేడు ఈ విషయము మన యెడల ఎంత సత్యమో, పురాతన కాలములో జీవించిన ఇశ్రాయేలు యెడల కూడా అదే సత్యము వర్తింపచేయబడినది. ఇశ్రాయేలు ఐగుప్తు దేశములో బంధీలుగాను, బానిసలుగాను బ్రతికియున్నను దేవునికి వారియెడల ఉన్న ప్రేమను బట్టి, కృపను బట్టి వారికి గొప్ప విమోచన లభించియున్నది. "నీవు ఐగుప్తు దేశమందు

దాసుడవైయున్నప్పుడు నీ దేవుడైన యెహోవా బాహు బలము చేతను, చాచిన చేతి చేతను నిన్ను అక్కడ నుండి రప్పించెనని జ్ఞాపకము చేసికొనుము. అందుచేతను విశ్రాంతి దినము ఆచరింపవలెనని నీ దేవుడైన యెహోవా నీకు ఆజ్ఞాపించెను" (ద్వితి 5:15).

అయితే వారు కూడా అదే సమయములో దేవునికి భయపడి ఆయనను ప్రేమించియున్నారు. వారు ఆవిధముగా జీవించియున్న యెడల యేసు మన కొరకు సిలువ మీద మరణించిన దానిని బట్టియు, ఆ గొప్ప సత్యమును బట్టియు, మరింత ఎక్కువ ఆయనకు భయపడి ప్రేమించబద్దులమై యున్నాము.

**ప్రకటన 14:6,7 చదువుడి. దేవుని యొక్క కడవరి దినమునకు చెందిన వర్తమానములో "దేవునికి భయపడి" అనే ఆజ్ఞ ముందుగా ఎందుకు ఇవ్వబడెను? అర్థము చేసుకొనుటకు ప్రయత్నించండి.**

మంగళవారం అక్టోబరు 19

## ఆయన మనలను ముందుగా ప్రేమించెను

ద్వితియోపదేశ కాండములో నియమములు మరియు శాసనములు, హెచ్చరికలు మందలింపులు ఉన్నప్పటికి యూదయ దేశము దేవుని యొక్క ఆజ్ఞలకు, ఆయన తీర్పులకు, శాసనములకు విధేయత చూపించవలసియున్నది. మరియు అన్నిటి కన్నా ముఖ్యముగా ఇశ్రాయేలు ప్రజలు దేవునిని పూర్ణ హృదయముతోను, పూర్ణాత్మతోను, పూర్ణశక్తితోను ప్రేమించవలసియున్నారనే విషయము అన్నిటికన్నా మొదటిదైయున్నది. ఆవిధముగా వారు చేయుటకు వారికి చాలా మంచి కారణములున్నవి.

**ద్వితి 4:37; 7:7,8,13; 10:15; 23:5 మరియు ద్వితి 33:3 చదువుడి. తన ప్రజల యెడల దేవునికున్న ప్రేమను గూర్చి ఈ వాక్యములు ఏమి బోధించుచున్నవి?**

ఇశ్రాయేలు ప్రజల యొక్క తండ్రులపైన మరియు వారి పైన దేవుడు చూపించిన ప్రేమను గూర్చి ద్వితియోపదేశకాండములో మోషే అనేకమార్లు వివరించెను. దేవుడు తన మాటల ద్వారా కన్నా ఆయన క్రియల ద్వారా తన ప్రేమను ప్రజలకు చూపించాడు. అయినప్పటికి ఇశ్రాయేలు ప్రజలు వారి పాపములను బట్టి వారి అపజయములను బట్టి దేవునిని ఎల్లప్పుడు తృణీకరిస్తూ ఆయన ప్రేమను శంకిస్తూ ఉండేవారు. అటువంటి స్థితిలో కూడా దేవుడు వారిని ముందుగా ప్రేమిస్తూనే ఉన్నాడు.

**"ఆయన మనలను ముందుగా ప్రేమించెను గనుక మనము ఆయనను ప్రేమించుచున్నాము (1యోహాను 4:19) దేవునిని మనము ఎందుకు ప్రేమించాలనే విషయమును గూర్చి అర్థము చేసుకొనుటకు ఈ వాక్యము ఎట్లు సహాయపడుతుంది?**

మనము ఉనికిలోనికి రాకపూర్వమే మన యెడల దేవుని యొక్క ప్రేమ తన రక్షణ

ప్రణాళిక ద్వారా ఈ లోకానికి పునాదులు వేయక పూర్వమే తెలియపర్చెను" (ఎఫెసి 1:4).

ఆదాము పాపములో పడిన తరువాత పాపవిమోచన ప్రణాళికను గూర్చి దేవుడు తలంచలేదు. ఒకవేళ ఆదాము పాపములో పడిన యెడల తనను రక్షించు నిమిత్తము దేవుడు ముందుగానే సిద్ధము చేసుకొనెను. "అనాది నుండి రహస్యముగా ఉంచి ఇపుడు ప్రత్యక్షపర్చబడిన మర్మము" (రోమా 16:25). అని రక్షణ ప్రణాళికను గూర్చి తెలియపర్చడమైనది. దేవుని యొక్క సింహాసనమునకు పునాదులుగా ఉన్నటువంటి నియమముల యొక్క రహస్యము ప్రత్యక్షపర్చబడినవి" –ఎలెన్ జి వైట్, యుగయుగాల ఆకాంక్ష పుట 22.

దేవుడు ప్రేమామాయుడై యుండుట మనకు ఎంత మేలు. మన యెడల ఆయనకున్న ప్రేమ, ఆయనను సిలువ యొద్దకు నడిపించి తనను తాను బలియాగముగా సమర్పించుకొనెను. "ఆయన మరణము పొందునంతగా అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్ను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:8). ఇదే విషయాన్ని పురాతన ఇశ్రాయేలీయులు ఊహించడానికి కూడా సాధ్యపడనిది నేడు మనకు బయలుపర్చబడెను.

**దేవుడు ప్రేమైయుండుటకు బదులు, ఆయన ద్వేషించేవాడై యుండిన యెడల లేక మన యెడల ఆయనకు ఎటువంటి భావములేని యెడల పరిస్థితి ఏవిధముగా ఉండెడిది? దేవుని యొక్క ప్రేమను బట్టి మనము ఆనందించవలసిన విషయమేమిటి?**

**బుధవారం** **అక్టోబరు 20**

## మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొనుడి

ఇశ్రాయేలు జనాంగము ఒక దేశముగా దేవునిని ప్రేమించమని పిలువబడెను. అయితే దేవునిని ప్రేమించడమనునది ఒక్కొక్కరుగా చేయవలసిన విధియైయున్నది. ప్రతి మానవునికి, ఒక మనిషిగా స్వేచ్ఛ అనుగ్రహించబడెను. ఇశ్రాయేలీయులలో ప్రతి ఒక్కరు దేవునిని ప్రేమించాలనే తీర్మానమును తీసుకొనవలసియున్నది. మరియు వారు వారి యొక్క విధేయత ద్వారా ఆ ప్రేమను దేవుని యెడల చూపించవలసియున్నారు.

**ఈ క్రింద ఇవ్వబడిన అన్ని వాక్యాలలో సమానముగా ఉన్న ప్రధాన అంశము ఏమిటి?**

ద్వితి 5:10 ..............................................................................

ద్వితి 7:9 ..............................................................................

ద్వితి 10:12 ..............................................................................

ద్వితి 11:1 ..............................................................................

ద్వితి 19:9 ..............................................................................

దేవుని వాక్యము ఇంతకన్నా స్పష్టముగా ఉండగలదా? దేవుడు మనలను ప్రేమించుచున్నాడని చెప్పుటయేకాకుండా ఆయన మన యెడల చేసిన దానిని మరియు

ఇప్పటికి చేయుచున్నదాని ప్రకారము తన ప్రేమను బయలుపర్చెను. దేవుని ప్రజలు కూడా వారి క్రియల ద్వారా ఆయనను ప్రేమించుచున్నట్లు చూపించవలసియున్నారు. పైన పేర్కొనబడిన వాక్యములలో దేవుని యెడల మనము చూపించే ప్రేమ ఆయనకు మనము చూపించే విధేయతతో సంబంధము కలిగియున్నట్లు చూడగలము.

"అందునుబట్టియే యోహాను ఈవిధముగా చెప్పియున్నాడు. మనము ఆయన ఆజ్ఞలను గైకొనుటయే దేవుని ప్రేమించుట" (1యోహాను 5:3). మీరు నన్ను ప్రేమించిన యెడల నా ఆజ్ఞలను గైకొనుడి" అని యేసు చెప్పెను (యోహా 14:15). ఈ వాక్యాలు ప్రేమను గూర్చి ఒక ప్రాథమిక విషయాన్ని బోధించుచున్నవి. దేవునిని ప్రేమించడమంటే ఎల్లప్పుడు దేవునికి విధేయత చూపుట అని అర్థము. ఇది అన్ని తరముల జనాంగమునకు వర్తిస్తుంది. దేవునికి విధేయత చూపుటంటే పది ఆజ్ఞలనబడే ఆయన చట్టానికి విధేయత చూపుట ముఖ్యముగా అందులో సబ్బాతును గూర్చిన నాల్గవ ఆజ్ఞ కూడా యిమిడి యున్నది. పది ఆజ్ఞలలోని 9 ఆజ్ఞలను గైకొనేటప్పుడు వాటికి చట్టబద్ధతను ఆపాదించకుండా కేవలం సబ్బాతుకు సంబంధించిన నాల్గవ ఆజ్ఞను గైకొనేటప్పుడు దానికి చట్టబద్ధతను ఆపాదించుట ఏమి ధర్మము?

ఆజ్ఞలకు విధేయత చూపుట చట్టబద్ధత క్రిందకు వచ్చినను అది నిజముగా దేవుని యెడల ఉన్న ప్రేమకు విధేయత చూపించినట్లు ఉండదు అని అర్థము. క్రీస్తు యేసు మన యెడల చేసిన దానికి ప్రతిఫలముగా ఆయన కోరుకొనుచున్నాడు.

మోషే ఇశ్రాయేలీయులను దేవుని ప్రేమించాలి మరియు ఆయనకు విధేయత చూపాలని హెచ్చరించినపుడు అంతకు పూర్వమే దేవుడు వారిని ఐగుప్తు నుండి విమోచించియున్నాడు. దేవుడు వారి యెడల చేసిన కార్యమునకు కృతజ్ఞతగా ఆయన ఆజ్ఞలకు విధేయత చూపమని హెచ్చరింపబడిరి. అదే నియమము నేడు మనకు కూడా వర్తిస్తుంది కదా?

**దేవునికి విధేయత చూపే విషయములో నీ యొక్క స్వీయ అనుభవము ఏమిటి? ప్రేమతో ఆయనకు ఎందుకు విధేయత చూపాలి?**

## గురువారం — అక్టోబరు 21

## మొదటి ఆజ్ఞ

అనేక కారణములను చూపిస్తూ చాలామంది క్రైస్తవులు పాత నిబంధన గ్రంథమును క్రొత్త నిబంధన గ్రంథమును వేరు చేసి చూపిస్తున్నారు. ముఖ్యముగా క్రొత్త నిబంధన యొక్క నిజమైన భావమును తొలగించి చూపిస్తున్నారు. నూతన నిబంధన గ్రంథము యేసును బహిరంగ పర్చడమే కాకుండా, ఆయన జీవితము మరణము, పునరుత్థానము మరియు ప్రధాన యాజకత్వపు పరిచర్యను గూర్చి వేదాంత సంబంధమైన వివరణను అందించుట ద్వారా పాత నిబంధన గ్రంథములోని ప్రవచనములు మరియు గుర్తుల యొక్క నెరవేర్పును

గూర్చి క్రొత్త నిబంధన వివరించుచున్నది. అనేక విషయాలకు పాత నిబంధన గ్రంథము నూతన నిబంధన గ్రంథమునకు పూర్వరంగముగను మరియు సందర్భ సహితమైన ఆధారమగును ఉపయోగపడుతున్నది. రెండు నిబంధనలు కూడా దేవుని యొక్క ప్రేమను మరియు ఆయన మంచితనమును బయలుపర్చుచున్నవి.

ఈ కారణమును బట్టియే, నూతన నిబంధన గ్రంథము, చివరికి యేసుతో సహా పాతనిబంధన గ్రంథము నుండి ఎన్నో విషయాలను ఉదహరించి చెప్పడం జరిగియున్నది.

**మార్కు 12:28-30 చదువుడి. అన్ని ఆజ్ఞలలో కెల్లా మొదటి ఆజ్ఞను గూర్చి అడిగిన ప్రశ్న ఏమిటి? ఈ ప్రశ్నకు జవాబుగా యేసు చెప్పిన విషయమేమిటి? ఆయన యిచ్చిన జవాబును ఎక్కడ నుండి తీసుకొనెను?**

ఇక్కడ ఆసక్తిని కలిగించే విషయమేమిటంటే యేసును ప్రశ్నించిన వ్యక్తి ధర్మశాస్త్ర నిపుణుడైన ఒక శాస్త్రియైయున్నాడు (నిజానికి యూదయ సంప్రదాయము ప్రకారము 613 చట్టములు లేక ఆజ్ఞలున్నవి). యూదులు అనేక చట్టములకు విధేయులైయుండాలని తెలిసి కూడా వాటన్నింటిలోను ప్రధానమైన ఆజ్ఞ ఏమిటని యేసును అడిగెను.

దానికి జవాబుగా యేసు ఏమి చేసాడు? యేసు నేరుగా ద్వితియోపదేశ కాండము 6వ అధ్యాయమునకు వెళ్ళి "ఇశ్రాయేలూ వినుము. మన దేవుడైన యెహోవా అద్వితీయుడగు యెహోవా" (ద్వితి 6:4) అని జవాబు చెప్పి దాని తరువాత ఉన్న వాక్యములను కూడా ఉదహరించి 'నీ పూర్ణ హృదయముతోను, నీ పూర్ణాత్మతోను, నీ పూర్ణశక్తితోను నీ దేవుడైన యెహోవాను ప్రేమింపవలెను" అని చెప్పెను.

ఈ ఆజ్ఞకు మించిన "నేటి కాలమునకు సత్యము" ఇంకేమైనను ఉన్నదా? కడవరి దినములలో ప్రతి ఒక్కరు ఏదో ఒక పక్షమున నిలువబడుటకు ఎంచుకొనమని పిలువబడుదురు. అట్టి సమయములో దేవుని యొక్క ఆజ్ఞలు (ప్రక 14:12) ఒక ప్రధాన పాత్రను పోషిస్తాయి.

శ్రమలను ఎదుర్కొనే సమయములో కూడా మనము ఏ పక్షాన నిలువబడుటకు ఎంచుకుంటామో అది దేవునిని నిజముగా ప్రేమిస్తున్నామా? లేదా అనే విషయము మీద ఆధారపడియుంటుంది.

**దేవునిని వ్యక్తిగతముగా ఎన్నడు చూడని ఒక వ్యక్తి ఆయనను ఏవిధముగా ప్రేమించగలడు? అని ఎవరైనా నిన్ను అడిగితే నీ సమాధానమేమైఉంటుంది?**

**శుక్రవారం** **అక్టోబరు 22**

## అదనపు అధ్యయనము

విమోచింపబడిన వారు శాశ్వత కాలము క్రీస్తు సిలువకు సంబంధించిన కీర్తనను

పాడుచు మరియు దానికి సంబంధించిన విజ్ఞాన శాస్త్రమును అధ్యయనము చేయబోవుచున్నారు. మహిమపర్చబడిన క్రీస్తుతో సిలువ వేయబడిన క్రీస్తును వారు చూచెదరు. ఆయనకున్న సృష్టించగలిగే శక్తిని ఎన్నడూ మరచిపోలేరు. లెక్కించడానికి వీలుకానన్ని లోకాలను ఈ విశాలములో సృష్టించిన సృష్టికర్తను మరియు పరలోకమందున్న ఆయన మహిమను గూర్చి కెరూబులు గాన ప్రతిగానములతో మహిమపర్చుచుండగ పతనమైన మానవుని తన చెంతకు చేర్చుకొనుటకు తనను తాను తగ్గించుకొని పాపము వలన వచ్చు నేరమును, అవమానమును ఆయన భరించి కల్వరి యొక్క సిలువపై తన హృదయమును నలుగగొట్టుకొని పతనమైన లోకము యొక్క వేదనలను తుడిచి వేసెను. సర్వలోకములను సృష్టించిన సృష్టికర్త అందరి భవిష్యత్తులను నిర్ణయించి వేసెను. ఒక మధ్యవర్తిగ తన మహిమను ప్రక్కన పెట్టి అవమానమునకు గురైనను, మానవుని విమోచించుట కొరకు ఇవన్నియు ఆయన భరించెను. రక్షింపబడిన ప్రజలు వారి యొక్క విమోచకుని వైపు చూచుచుండగ తండ్రి యొక్క సింహాసనమును చూచినపుడు వధింపబడిన గొఱ్ఱెపిల్ల మనలను దేవుని యొద్దకు చేర్చుటకు తన సొంత రక్తమును చిందించెననియు, ఆయన మహిమపర్చబడుటకు యోగ్యుడని విమోచింపబడినవారు అత్యానందముతో గొప్ప పాటను పాడెదరు" –ఎలెన్ జి వైట్, మహా గొప్ప పోరాటము, పుటలు 651, 652.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. పైన పేర్కొనబడిన ఎలెన్ జి వైట్ యొక్క వ్యాఖ్యానమును చదవండి. మనము దేవునిని ఎందుకంత గొప్పగా ప్రేమించవలసియున్నాము అనే విషయమును గూర్చి ఎట్లు అర్థము చేసుకొనగలము? ఈ సత్యము దేవునితో మనకున్న బాంధవ్యమునకు ఎందుకు పునాదిగా ఉండాలి?
2. ఏక కాలములో దేవునికి భయపడి మరియు ఆయనను ప్రేమించాలనే భావమును గూర్చి ఆలోచించండి. మనము ఈ రెండింటిని ఏవిధముగా చేయగలము? మరియు ఎందుకు చేయవలసియున్నాము?
3. మన జీవితములో అన్ని విషయాలు సక్రమముగా జరిగిపోతున్నపుడు దేవునిని ప్రేమించడమనునది అంత కష్టమైన విషయము కాదు. అయితే మన జీవితములోని కొన్ని విషయాలు మనము ఆశించినట్లు జరగనప్పుడు దేవుని ప్రేమించే విషయములో పరిస్థితి ఏమిటి? అటువంటి వ్యతిరేక పరిస్థితులలో దేవునిని మరింత ఎక్కువగా ప్రేమించవలసియున్నామా?

★★★